యోగనిద్రా ప్రహసనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

కీర్తిశేషులయిన రావుబహద్దూరు

కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు.

ప్ర హ స న ము లు.

మొదటి సంపుటము

1 అపూర్వబ్రహ్మచర్య
2 విచిత్రవివాహము
3 మహాబధిర
4 పునర్మరణము
5 బలాత్కారగానవినోదం
6 కలహప్రియా
7 మహామహోపాధ్యాయ
8 యోగనిద్రా
9 మహావంచక
10 అసహాయశూర
11 కలిపురుషశనైశ్చరవిలాసము
12 వేశ్యాప్రియా
13 కౌతుకవర్ధని
14 వినోదతరంగిణి
15 హాస్యసంజీవిని మొదటిభాగం
16 ,, రెండవభాగం
17 ,, మూనడభాగం

నా ట క ము లు

రెండవ సంపుట

1 బ్రహ్మవివాహము
2 వ్యవహారధర్మబోధిని
3 తిర్యగ్విద్వన్మహాసభ
(మూషకాసుర విజయం)
4 మహారణ్యపురాధిపత్యము
5 ప్రహ్లాద
6 సత్యహరిశ్చంద్ర
7 దక్షిణగోగ్రహణము
8 వివేకదీపిక

భాషాంతరీకృతనాటకములు

మూడవ సంపుటము

1 చమత్కార రత్నావళి
2 రాగమంజరి
3 కళ్యాణకల్పవల్లి
4 అభిజ్ఞాన శాకుంతలము
5 రత్నావళి
6 మాలవికాగ్నిమిత్రము
7 ప్రబోధచంద్రోదయము
8 వెనీసువర్తక చరిత్రము

వ చ న ప్ర బ ం ధ ము లు

పద్యకావ్యములు.

నాల్గవ సంపుటము

1 సత్యరాజాపూర్వదేశ
యాత్రలు (1, 2 భాగములు)
2 రాజశేఖర చరిత్రము
3 శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచన
నైషధము
4 రసికజనమనోరంజనము
5 శుద్ధాంధ్రభారతసంగ్రహము
6 అభాగ్యోపాఖ్యానము
7 పథికవిలాసము
8 జాన్‌గిల్పిన్
9 నీతిదీపిక

యోగనిద్రాప్రహసనము

— ఈనాటకమునందువచ్చు పాత్రములు —

మతిమంతుఁడు—యోగశాస్త్రాభ్యాసము చేయుచున్న యొక వృద్ధుఁడు

సుబలుఁడు—మతిమంతుని మేనల్లుఁడు

సదానందయోగి—భూతవైద్యము తెలిసినయోగి

గజాననదాసు—వైద్యుఁడు

రాముఁడు—మతిమంతుని సేవకుఁడు

సుమతి—మతిమంతునికూఁతురు

గౌరి—మతిమంతుని యింటిదాసి

రంగము—మతిమంతుని యిల్లు.

[సుమతి ప్రవేశించుచున్నది]

సుమ—వొంటిరిగాకూర్చుంటే యేమీా తోచకుండావున్నది. మాట్లాడడానికి వక్క రాముడుతప్ప మరియెవరూ కనపడరు. వాడు యెప్పుడూ యేదో సణుక్కుంటూవుంటాడు. నాన్నగారు యోగపు పిచ్చిలోపడి రాత్రీ పగలూ ముక్కుమూసుకుని కూర్చుంటూ పాత తాటాకుల పుస్తకాలు ముందువేసికొని ఆకులు తిరగవేస్తూ ఎంతో ధ్యానంలేకుండా వున్నారు. ఆపిచ్చపుస్తకాలచేత ఆయనకు మతిపోయినట్టు వున్నట్టున్నది. అదుగో యేదో చప్పు డవుతూ వున్నది. [illegible]

రాముడు పుస్తకాలకట్ట కిందపడవేసినాడు. ఓరీ! రామా! యేమిటి చేస్తూవున్నావు?

[అప్పుడు రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాము—యేమీ చెయ్యడంలేదు. పుస్తకాలు చేతులోనుంచి జారిపోయినవి. దిక్కుమాలిన పుస్తకాలు వొక్కొక్కటి నాలుగేసి మళ్ళ బలువువున్నవి. ఈగదిలోకి తీసుకురావలసినవి యిటువంటివి పది పుస్తకాలున్నవి. ఈపుస్తకం కాలిమీదపడి కాలివేళ్ళన్నీ నలిగి పోయినవి. (అనిచేతిలోని పుస్తకములుబల్లమీద పెట్టుచున్నాఁడు.)

సుమ—(నవ్వుచు) ఆ పుస్తకం కిందపడవేసినందుకు నాన్న గారు కోపపడుతారేమో?

రాము—నేను పడవెయ్యలేదు. దానంతట అదేపడ్డది. చేతులో వుండకుండా పసిపిల్లకాయలాగు జారికిందపడ్డది. నా తప్పితం యేమీ లేదు.

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—వస్తూవున్నాను. వచ్చేవచ్చే-అమ్మగారూ! చూచినారా ఆయన యెలాగు తొందర పెడుతూవున్నారో.

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—తొందరపడకండి. వస్తూవున్నాను. ఇక్కడ నేను ఆడు కోవడంలేదు. (అని క్రిందపడ్డ పుస్తకమును చేతితో తీయుచున్నాఁడు.)

[అంతట మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు]

మతి—రామా? మిగిలిన పుస్తకాలు నీవుయివేళ యిక్కడకు తీసుకునిరావడం వున్నదా? రోజంతా యిక్కడనే వుంటావా?— అమ్మాయీ? నీవూ యిక్కడనే వున్నావా?

సుమ—యిప్పుడేవచ్చినాను. తోటలో నాకు సంపెంగ పువ్వులు కోసియిస్తామన్నారు వస్తారా?

మతి—యిప్పుడు రావడానికి తీరుబడిలేదు. నేనును యిప్పుడు పుస్తకంలో ప్రాణాయామాన్ని గురించి చదువుతూ వున్నాను. అది అర్థంకావడంలేదు. అదిగ్రహిస్తేనేకాని నేను యెక్కడికీరాను — ఓరీ రామా! మా మాటలు అలకిస్తూ అలానిలుచున్నావేమి? నీవు కింద కూర్చుండి పుస్తకాలన్నీ బల్లమీద వరుసగాపెట్టు.

రాము—చిత్తము. (అని యొకపుస్తకము క్రిందవేసి దానిమీద కూర్చున్నాడు.)

మతి—ఓరిపశువా! పతంజలిమీద కూర్చున్నావేమిరా? లేలే. అపచారంవస్తుంది. ఆయన యెవరనుకున్నావు? మొట్టమొదట యోగ సూత్రాలుచేసిన మహానుభావుడు.

రాము—అపచారం రావడానికి నేను యెవరిమీదా మనిషి మీద కూర్చోలేదు. బట్టమురికవుతుందని యెందుకనా పనికిమాలిన యీపాతతుక్కు పుస్తకంమీద కూర్చున్నాను. కిందమనిషివుంటే కూర్చోవడానికి నాకంత బాస్తిగా కష్టంకనపడ వనుకున్నారా యేమిటి?

మతి—అది పనికిమాలిన పాతతుక్కు—పుస్తకమట్రా? దాని విలువ చదువురాని శుద్ధపశువువు నీకు యేమి తెలుస్తుంది? నేను నిన్నటి రోజల్లా కష్టపడి అంటలుకట్టుకుపోయిన పత్రాలన్నీ జాగ్రతగావిడదీసి పురుగులుదులిపి వేసి కట్టకట్టినాను. రెండు వ్యాఖ్యానాలతోవున్న దాన్ని పనికిమాలిన తుక్కంటావురా?

[అప్పుడు చేతిలో నొకయుత్తరము పట్టుకొని గౌరి ప్రవేశించుచున్నది.]

గౌరి—అయ్యా! మీకు టపాలో వుత్తరంవచ్చింది. (అని చేతి కిచ్చి వెళ్ళుచున్నది.)

మతి—ఏమిటీ! వుత్తరమా? ఆగమశాస్త్రవేత్తఅయిన గౌరీపతి శాస్త్రుర్ల దగ్గిరనుంచి కాబోలును. (అని చూచి) కాదుకాదు. ఈవుత్త రం తరువాత నెమ్మదిగా చదువవచ్చునులే. (అని క్రింద పడవేయు చున్నాఁడు.)

సుమ—నాన్నగారూ? మీరు వుత్తరంవిప్పి చదువుకోకుండానే కిందపడవేసినారు. దానిలో యేవయినా జరూరు సంగతులున్నవేమో! నేను విప్పి చదువుదునా? (అని యుత్తరము పుచ్చుకొనిచూచి) దీని మీద పెద్దాపురంముద్రవున్నది. ఇది మామయ్యదగ్గిరనుంచి వచ్చింది వేగిరం చదవండీ.

మతి—(ఉత్తరమువిప్పి చదివి) పిచ్చివాడా? ఇది బాగానే వున్నది. అంతకంతకు పిచ్చిముదిరితే యేమోస్తరుకువస్తుందో? అయినా ఫర్వాలేదు. నేను యోగదృష్టితోచూచి మనోబలం వుప యోగ పరిస్తే యెటువంటివాణ్నయినా నిముషంలో వశపరుచుకో వచ్చును. అతను రావడంతోటే ప్రయత్నంచేసి చూస్తాను. ఇప్పుడు వెళ్ళి వక్కనిముషం ప్రాణాయామంబట్టి మళ్ళీవస్తాను. (అని యుత్తర మక్కడ పడవైచి వెళ్ళుచున్నాఁడు.)

సుమ—నాన్నగారు వూరికే జపంపిచ్చలో పడిపోయినారు. తిన్నగా వేళకు భోజనానికైనా రావడంలేదు. నేను యీవుత్తరములో యేమివున్నదో చదువుతాను. (అని చదువుచున్నది. "మీచెల్లలు పోయినప్పటినుంచీ మీ మేనల్లుడికి విచారంచేత బొత్తిగా పిచ్చియెత్తి

పోయింది" పాపం సుబలుడికి పిచ్చియెత్తింది కాబోలును. ఆతణ్ణి చూచి నాలుగుసంవత్సరాలు కావచ్చింది. ఇక్కడవున్నప్పుడు ఆతను నామీద యెంతో ప్రేమగా వుండేవాడు. తరువాత చదువుదాము— "అతనికి యేమీతోచక వూరికే పిచ్చివాడులాగు తిరుగుతూవున్నాడు. అతనికి మనస్సు స్వస్థతపడేదాకా కొంతకాలంమీదగ్గిరవుండడానికి నేటి సాయంకాలమే మీదగ్గరకు పంపిస్తూవున్నాను. రేపు మధ్యాహ్నానికి అక్కడకువస్తాడు."—రేపుమధ్యాహ్నానికా? అలాగైతే యింక కాస్త సేపటికి వస్తాడు— "అతనివిషయం మీరు కొంచెం శ్రద్ధవహించి మనస్సు స్థిమితపడేటట్టు చెయ్యవలెను. సుమతితోకూడి అల్లరిగా తిరగనియ్యకండి. మావాణ్ని మీయోగపిచ్చిలోమాత్రం దింపవద్దు. వాడికి యిదివరకువున్న పిచ్చచాలును."

రాము—అలాగైతే యిక మనయింట్లో పిచ్చివాళ్ళు వకరికి యిద్దరవుతారు.

సుమ—వకరెవరురా?

రాము—అయ్యగారు.

సుమ—నోటిమీదతన్ని పోయేరు. ఇటువంటి వేలాపనలుపేలకు గౌరిని నేను రమ్మన్నానని నాగదిలోకి పంపించి నీవువెళ్ళి నీపనిచేసుకో. పో. (అని వెళ్ళుచున్నది.)

రాము—అమ్మా! యిప్పుడే వెళుతాను. అయ్యో! అప్పుడే యీవిడె వెళ్ళిపోయిందే. అమ్మాయిగారికి నామీదకోపంవచ్చింది కాబోలును. అదుగో గౌరి యిక్కడికే వస్తూవున్నది. నేను వెళ్ళనక్కరలేదు.

[గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి—ఓయీరామా! నీవు వొంటరిగా యిక్కడ యేమి చేస్తూ వున్నావు? మామూలుప్రకారంగా నీలోనీవు సణుక్కుంటూ వున్నావాయేమిటి?

రాము—నేనుచేసేపనే నీవుచేసేటట్టయితే నీవునాకంటె యెక్కు వసణుక్కుందువు. పురుగులు దులిపినేసి పక్కపుస్తకానికి వర్ణంవేస్తే నాకువుండేకష్టం నీకు అప్పుడు తెలుస్తుంది. ఓసీ! గౌరీ! ఈరోజుమన యింటికి యెవరోవస్తారట! యెవరువస్తారో యెరుగుదువా?

గౌరి—యెరగను. యెవరో మంత్రాలు తెలిసిన యోగులు వస్తారనుకుంటాను.

రాము—కాను కాదు. వకపిచ్చివాడు వస్తూవున్నాడు.

గౌరి—పిచ్చివాడా! నాకు భయం వేస్తూవున్నది. అతను యెవ రినీ కొట్టేతిట్టే వాడుకాడుగద.

రాము—ఏమో తెలియదు. అతడు మనయజమానుడికి జతగా వుంటాడు. అయినా కానీ అతడుకూడా తాను వచ్చేటప్పుడు పాత తాటాకుల పొస్తకాలు యేమయినా తెస్తాడేమోనని నాకూ భయం గానే వున్నది.

గౌరి—పొస్తకాలు తెస్తేనేమికాని అతడుకొట్టేవాడవునో కాదో కనుక్కొని ముందుగా చెప్పాదూ.

రాము—కనుకోక్క నక్కరలేదు. వాళ్ళకుకొంచెం వ్యతిరేకంగా యేమయినా చేసినా అన్నా పిచ్చివాళ్ళందరూ కొడుతారు. నీవు జాగ్ర తగా వుండవలెను! నీవు అతను చెప్పినట్లల్లా చెయ్యకపోతే నీ కొప్పులో వెంట్రుకలు నాలుగూ వూడదీసి చేతులో పెడుతాడు.

గౌరి—అలాగైతే నాకుమరీభయంవేస్తూవున్నది. మూర్ఛ వస్తూవున్నది. (అనిమీదపడఁబోవుచున్నది.)

రాము—గౌరీ! దూరంగాపో. ఇక్కడ మూర్ఛపోకు. నీకు మూర్ఛపోవడం యిష్టంగావున్నట్టయితే లోపలికిపోయి నీళ్ళపొయికాడ నిప్పులలోనూ నీళ్ళలోనూ మూర్ఛపో.

గౌరి—రామా! నీవుయింత క్రూరుడవవుతావని నేనుయెన్నడూ అనుకోలేదు. నీవు నామతిపోగొట్టివేసినావు. (అని యేడ్చుచున్నది.)

రాము—నీకేమీ భయములేదు యేడువకు. ఆపిచ్చివాడు నీ జోలికి రాడులే. ధైర్యంగావుండు.

గౌరి—నీవు చెప్పినమాటలు విన్నతరువాత మళ్ళీధైర్యంయెలా వస్తుంది? మూర్ఛవస్తూవున్నది. ఇదుగో మూర్ఛపోతూవున్నాను.
(అని సోలుచున్నది.)

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—అయ్యో! అయ్యగారు పిలుస్తూవున్నారు.

గౌరి—ఇటువంటి మూర్ఛలో నీవునన్ను వదిలిపెట్టి వెళ్ళ కూడదు.

రాము—మూర్ఛపోవడానికి ఇదిసమయంకాదు. మనయజమానుడు జపంమీద కూర్చున్నప్పుడు సమయం కనిపెట్టి చెప్తాను. నీవప్పుడు కావలసినంతసేపు సావకాశంగా మూర్ఛపోవచ్చును. ఇప్పుడు లేచి వేగిరం యింట్లోకి పరుగెత్తు.

గౌరి—నీమాటప్రకారం నడుచుకుంటాను. (అని లేచి వెళ్ళుచున్నది.)

[అంతట మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—ఓరి ముద్దా! పిలవగానే యెందుకురావు? నీవుయెప్పుడు దానితో పరియాచికాలాడుతూ కూర్చుంటావు.

రాము—అలాగంటిపని నేనుయెప్పుడూ చెయ్యడంలేదండి. అదే నన్ను పరియాచకాలు చేస్తూవుంటుంది.

మతి—చాలును. ఈపాటినోరుమూసుకో. ఈవేళ మనయింటికి నామేనల్లుడు వస్తూవున్నాడు. అతనికి కొంచెం చిత్తచాంచల్యం.

రాము—అదియేమిటండీ?

మతి—మరేమీలేదు. మతిభ్రమవస్తూవుంటుంది.

రాము—మీరు చెప్పినవేవో నాకు తెలియవు. అవచ్చేవి రెండూ యేవో జంతువులనుకుంటాను. అవియేమీ హానిచేసేవి కావు గద?

మతి—జంతువులూలేదు నీ మొఖమూలేదువూరుకో. నామేనల్లుడి విషయంలో నీవే చాలాశ్రద్ధ పుచ్చుకోవలెను. అతణ్ని నీవు యెప్పుడూ కనిపెట్టివుండి చూస్తూ మంచిమాటలుచెవుతూ కోపం రాకుండా చెయ్యవలెను. అతణ్ని రెచ్చకొట్టినావంటే నీతలకాయబద్దల కొడుతాడుసుమా. జాగ్రత. అతనికి యెప్పుడూ చిరాకు తెప్పించకు.

రాము—తెప్పించను. అతనిమీద యెప్పుడూ వకకన్ను వేసి జాగ్రతగా వుంటాను.

మతి—(ఆలకించి) అదుగో బండీచప్పుడవుతూ వున్నది. అతను వచ్చినట్టున్నాడు. రామూ! అతణ్ని నీవువెళ్ళి లోపలికి తీసుకునిరా.

రాము—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు)

మతి—సదానందయోగికిన్నీ గజాననదాసుకున్ను వర్తమానం పంపించినాను. వారుయిద్దరూవచ్చి యితణ్ని సావకాశంగా పరీక్షచేసి చూచి జబ్బుయొక్క స్వభావం నిశ్చయంచేసి చెపుతారు. వారు యిద్దరూ నిస్సందేహంగా చిత్తచాంచల్యమనే నిశ్చయం చేస్తారు. పాములమంత్రగాడు తాచుపామును వశ్యంచేసుకున్నట్లు నేను యీ రోగిని యోగదృష్టిచేతచూచి నిముషంలో లోబరుచుకుంటాను. యోగ మహిమ కనపరచడానికి యిప్పుడు మంచి అవకాశం కలిగింది. మనోబలంచేత యెటువంటి రోగాలనైనా మల్లించవచ్చును. అతడు యెంత అల్లరిచేస్తూవున్నా మనస్సుస్థిరపరిచి తేరపారచూచినానంటే యోగ

నిద్రచేత చిత్రపు ప్రతిమలాగు అయిపోతాడు. అదుగో అతను వస్తూ వున్నాడు. నేనులోపలికి వెళుతాను. అతణ్ని చూస్తే నాకు దేహం పులకరిస్తూవున్నది. (అని వెళ్ళుచున్నాఁడు.)

[సుబలుఁడును రాముఁడును ప్రవేశించుచున్నారు.]

సుబ—పడవలు కొంచెం ఆలస్యంగా బయలుదేరినా మెలాగైతే నేమి కష్టపడి అనుకున్న వేళకు యిక్కడచేరినాము—ఓయి రామా మా సామానంతా లోపల యేదైనాగదిలోపెట్టించు. ప్రయాణం తొందరలో రాత్రినేను తిన్నగా భోజనం చెయ్యలేదు. ఆకలివేస్తూ వున్నది. వంటయిందేమో కనుక్కునిరా.

రాము—(ఇల్లునాలుగు ప్రక్కలనుచూచి) వీటితో యెవరినీ కొట్టడానికి యితనికి అవకాశం లేకుండా చేస్తాను. (అని గోడమూలల నున్నచేతి కఱ్ఱలన్నియు పోగుచేయుచున్నాఁడు.)

సుబ—(కోపముతో) ఓరీ! నీతో నేను చెప్పినపని యేమిటి? నీవు యిక్కడ చేస్తూవున్న పనియేమిటి?

రాము—చిత్తముచిత్తము. వెళుతూవున్నాను. (అని కఱ్ఱలు చేతఁబట్టుకొని నడుచు చున్నాఁడు.)

సుబ—వీడిమోస్తరు చూస్తే తమాషాగావున్నది, ఇక్కడ వుంటే నేనాకఱ్ఱలు యెత్తుకుని పారిపోతాననుకున్నాడు కాబోలును. ఈ సావిట్లో నేను యిదివరకు కూర్చుని నాలుగుసంవత్సరాలు అయింది. అప్పుడు నేనూ సుమతీ యెంతో వినోదంగా ఆడుకుంటూవుండే వాళ్ళము. సుమతి యీపాటికి బాగా పెద్దదయి వుంటుంది. అప్పటికే యెంతో అందంగా వుండేది.

మతి—(తలుపుచాటునుండి చూచుచు) అమ్మాయీ! సుమతీ! యీ పావస్థితి చూచినావా? గౌరీ! మమ్మలిని తోసుకునిరాకు. నీవు తరువాత చూస్తువుకానిలే.

సుబ—మానాన్నగారు నన్ను యిక్కడకు అధాత్తుగా పంపించివేసినారు. మా మామగారు వట్టిచేదస్తుడు. ఇప్పుడు యోగపు పిచ్చలోపడి నిద్రాహారాలు లేకుండా రాత్రీపగలూ దానిలో మునిగి తేలుతూ వున్నాడట. అయినాకానీ యిక్కడ నాకు మనసుకలిసిన సుమతి యింట్లోవున్నదిగనుక వేడుకగా ప్రొద్దుగడపవచ్చును. యీ తాటాకు పుస్తకాలన్నీ మామగారి పాతపురాణాలు కాబోలును.

మతి—(చెవిలో గుసగుసలాడుచు) అమ్మాయీ! అవిపాత పురాణాలట. తానుకాదు. నేనేపిచ్చలోపడి వున్నానట. ఆమాటలు విన్నావా? ఈగౌరివ్వారికే తొందరపడుతూవున్నది. దాన్ని చూడనియ్యి. మనం వెళ్లుదాము. (అని వెళ్ళుచున్నారు.)

సుబ—(తలయెత్తిచూచి) యెవరో గుసగుసలాడుతూ వున్నట్టున్నారు. అదుగో ఆతలుపుదగ్గిర యెవరో చీరెకట్టుకుని నిలుచున్నారు. (అని తలుపువద్దికివెళ్ళి తలుపు తీసి గౌరిని ఈవలికి లాగుచున్నాఁడు.)

గౌరి—(కాళ్ళమీఁదపడి) మహాప్రభో! నన్ను రక్షించండి. చంపకండి. నాతల్లి ముసలిది. దానికి నేనుతప్ప మరియెవరూ దిక్కులేరు. నేనూ పదిహేడేళ్ళదాన్ని. కొంచెం కాలంలోనే పెళ్ళిచేసుకుని సుఖపడవలె ననుకుంటూవున్నాను. నా ప్రాణాలు కాపాడండి.

[అంతట రాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

రాము—(తనలో) ఈపిచ్చివాడు దీన్ని కాగలించుకోవడానికి ప్రయత్నం చేస్తూవున్నట్టున్నాడు. ఇదివకనేళ అయితే మదపిచ్చ అయివుంటుంది.

సుబ—(పకపకనవ్వుచు దానిని లేవఁదీసి) హాహాహా! నీకేం భయమేమీ ప్రాణభయం లేదు. లే. (పయివంకచూచి) ఆవచ్చిన వాడెవడు?

రాము—బాబూ! నన్ను కొట్టకండి. నేను వెళ్ళిపోతాను. (అని గంతులు వేయుచున్నాఁడు)

సుబ—అమ్మా! నీవు వెళ్ళిపో.

గౌరి—దేవుడా! ఇవేళకు బ్రతికి పోయినాను. (అని లోపలికి పరుగెత్తుచున్నది.)

సుబ—పాపం యిది పడుచుతనంలో బాగానే వున్నదికాని దీనికి కొంచెం వెర్రి అనుకుంటాను. వెర్రికాకపోతే యేమీకారణంలేనిదే నన్నుచూచి భయపడి యిలాగు వెర్రికేకలువెయ్యదు. వీడుకూడా లోపలికి పరుగెత్తబోతూవున్నాడు. (అని పై బట్టపట్టుకొని) ఓరీ పిచ్చివాడా! యెక్కడికి పరుగెత్తిపోతావు?

రాము—బాబూబాబూ! నాబట్ట చింపివెయ్యకండి. నెల్లాళ్ళయినా కాలేదుకొత్తబట్ట కొనుక్కున్నాను.

సుబ—(బట్టవిడిచి) ఓరి మూఢుడా! నేను నీబట్ట చింపుతాననుకున్నావుట్రా?

రాము—అయ్యా! మీకుదణ్ణంపెడుతాను. దూరంగావుండండి. నాజోలికిరాకండి. మీపిచ్చిచేష్టలు నామీద చూపకండి.

సుబ—మున్నపోతా! నావిపిచ్చిచేష్టలు అంటావురా? (అని రాముని జుట్టుపట్టుకొని వంగతీయుచున్నాఁడు.)

రాము—బాబూ! చస్తిని చస్తిని. (అని కేకలు వేయుచున్నాఁడు.)

[అప్పుడు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు]

మతి—మావాడికి పిచ్చి మహాయెక్కువగావున్నది. నవుకర్లనందరినీ కొడుతూ వున్నాడు. నేను యోగదృష్టితో చూచి యితణ్ని తక్షణం శాంతపరుస్తాను. (అని రెప్పవాల్చక చూచుచున్నాఁడు.)

సుబ—(మేనమామనుచూచి తొందరపడి) మామయ్యా! వీడు నావిపిచ్చిచేష్టలంటే కోపంవచ్చి కొంచెం జుట్టుపట్టుకున్నాను. అంతే కాని మరేమీలేదు.

మతి—(సుబలుని స్థిరదృష్టితో చూచుచు సమీపమునకు వెళ్ళి చేయిపట్టుకొని) నాడిబహువడిగా కొట్టుకొంటూవున్నది. ఇటువంటి వాళ్ళకు వుండేమోస్తరే యిది.

సుబ—(తనలో) ఈయనకు మతిపోయిందా యేమిటి? రెప్ప వాల్చకుండా దయ్యాలు పెట్టేవాడులాగు నావంక అలాచూస్తాడేమి!

రాము—(మతిమంతుని వెనుకకువచ్చి చెవిలో రహస్యముగా) సమయానికి మీరురాక పోయినట్లయితే యితఁడు యీపాటినన్ను చంపి వేసును. ఇతనిని సాధారణమయినపిచ్చి కాదు. యితణ్ని తాళ్ళోగీళ్ళో వేసికట్టిపెట్టి గదిలోవేసి వుంచవలెను. లేకపోతే మీయింటికి వచ్చేవారికి యెవరికైనా అపాయం వస్తుంది.

[అప్పుడు సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—(భయపడుచువచ్చి) నాన్నగారూ! (సుబలునిచూచి తొందరపడి) యిక్కడ మీరు వక్కరే వున్నారనుకున్నాను.

సుబ—సుమతీ! నన్నుచూచి యెవరినో పరాయివాణ్ని చూచినట్టు అలాతొందరపడుతావేమి? నేను నీబావను సుబలుణ్ని. నన్నప్పుడే మరచిపోయినావా? (అని సుమతి చేయిపట్టుకొనుచున్నాఁడు.)

రాము—అసుగో వకదాన్ని వదిలి రెండో ఆడదానిమీద పడ బోతూవున్నాడు.

సుమ—నన్ను ముట్టుకోకు. పడుచువాళ్లు యెదిగిన ఆడదాన్ని ముట్టుకోరాదు. (తనలో) ఇతని మోస్తరు చూస్తే నాకంతటిపిచ్చవాడుగా కనపడడంలేదు.

సుబ—దగ్గిరబంధువులలో అటువంటి అభ్యంతరాలు వుండకూడదు. చిన్నతనంలో మనం యిద్దరమూ ప్రాణస్నేహితులముగా వుండేవాళ్ళముకామా?

సుమ—నా చెయ్యివదులు. చిన్నతనంలో చేసినట్టు యిప్పుడు చెయ్యరాదు. (అని చేయివదల్చుకొని వెళ్ళి బల్లమీద కూరుచున్నది.)

మతి—(రెప్పవాల్చక సుబలుని యోగదృష్టితో చూచుచు (తనలో) ఇతడు లొంగిపోయినాడు. కాస్తసేపు దృష్టిపట్టి చూచేటప్పటికి పరమసాధువైనాడు. ఆహా! యేమియోగబలము! (బిగ్గరగా) అబ్బాయీ! నీకు ఆకలిగా వున్నట్టున్నది. నీవు కొంచెం సేపు నీమరదలితో మాట్లాడుతూకూర్చో. నేను లోపలికివెళ్ళి నీకు కావలసినవి జాగ్రత పెట్టించి యిప్పుడేవస్తాను. (అని సుమతియొద్దకు వెళ్ళి) అమ్మాయీ! నీవు కొంచెంసేపు యితనితో మంచిమాటలుచెప్పుతూ కూర్చో అతనుయేమన్నా అవునని అన్నిటికీ తలవూపుతూ వుండు. అతనికి వ్యతిరేకంగా యేమీచెప్పకు. వాళ్ళు చెప్పిందికాదంటే పిచ్చవాళ్ళకు పిచ్చ యెక్కువై కోపంవస్తుంది సుమా! (అని వెళ్ళుచున్నాడు.)

రాము—ఆయనలేనప్పుడు నేను మంత్రిస్తాను. (అని సుబలుని కేసి రెప్పవాల్చక చూచుచున్నాడు.)

సుబ—(చేతితో రాముని జూపుచు) సుమతీ! వీనికి కొంచెం మతిభ్రమవున్నదనుకుంటాను.

సుమ—వున్నది. తప్పకుండావున్నది. (తనలో) ఇతడన్నమాట కర్థంయేమిటో.

సుబ—వీణ్ని పిచ్చివాళ్ళ వైద్యశాలలోనుంచి తీసుకుని వచ్చి నట్టున్నారు.

సుమ—మీమామయ్య కోనసీమ వెళ్ళినప్పుడు అమలాపురాన్నుంచి తీసుకునివచ్చినారు. (ఇంతలో జ్ఞప్తికితెచ్చుకొని) కాదుకాదు. పిచ్చివాళ్ళ వైద్యశాలలో నుంచే తీసుకునివచ్చినారు.

సుబ—(నవ్వుచు) సుమతీ! నీవలాగు తడబడుతూ మాట్లాడుతావేమి? నాదగ్గిర నీకుభయంయెందుకు? నీ కావుంగరం మామయ్యగారు కొత్తగా చేయించినారా? నీచేతిని వుండడంవల్ల ఆవుంగరానికి యెంతో అందంవచ్చింది. (అని చేయిపట్టుకొను చున్నాడు.)

సుమ—(చటుక్కున చేయితీసికొని తనలో) మాట్లాడడాన్ని పట్టిచూస్తే యితడు మంచివాడులాగే కనపడుతూ వున్నాడుకాని పిచ్చవాడులాగు కనపడడంలేదు. (బిగ్గరగా) మీరువూరికేనన్ను స్తుతి చేస్తూవున్నారు.

సుబ—సుమతీ! సిగ్గువిడిచి దగ్గిరగా వచ్చికూర్చో. యెవరో కొత్తవాడిలాగునన్ను మీరూమీరూ అంటూవుండకు. మనలో మనకు మర్యాదలు యేమిటి? మునుపుపిలిచేటట్టుగానే నీవు అనిపిలుస్తూవుండు. మనం చెట్టాపట్టాలు వేసుకుని యీతోటలో తిరుగుతూ పళ్ళుకోసుకుని ఆడుకుంటూవుండేవాళ్ళం. ఆ సంగతంతా అప్పుడే మరిచి పోయినావా?

సుమ—మరిచిపోలేదు. మనంవకరోజు శాస్త్రుల్లగారి తోటలోకి వెళ్ళి నారింపండు కోసినప్పుడు జరిగినతమాషా నీకు యిప్పుడు జ్ఞాపకం వున్నదా?

సుబ—బాగాజ్ఞాపకంవున్నది. అతను మనల్ని తరుముకొచ్చే టప్పటికి మనం లేళ్ళలాగు పరుగెత్తుకువచ్చి వీధిలో పడ్డాము. అతను మననుపట్టుకోవలెనని వెనుక పరుగెత్తుకొనివచ్చి పరుగెత్తలేక కాలు జారి బొండులాగు బురదకాలువలో పడ్డాడు. బట్టలన్నీ బురదయి పోయి నవి. ఆ సంగతి చెప్పుకుని మనం నెల్లాళ్ళదాకా రోజూ కడుపు లుబ్బే టట్టుగా నవ్వుకుంటూవుండేవాళ్ళము. ఆచిన్ననాటి ఖులాసాదినాలు మళ్ళీరావు.

సుమ—అటువంటి దినాలు మళ్ళీరావు. అప్పుడు నీవు పిచ్చ— (జ్ఞప్తికితెచ్చుకొని) కాదుకాదు. నాఅభిప్రాయం అదికాదు. యేమీ లేదు. (అని తొందరపడుచున్నది.)

సుబ—సుమతీ! అలా భయపడుతావేమి? తొందరపడబోకు. నాదగ్గిర నీకు భయంయెందుకు?

సుమ—(లేచి మెల్లగా లోపలికి నడుచుచు) మానాన్నగారు—

సుబ—మీనాన్నగారు యేమిటి? ఆయనచూస్తే యేమి చేస్తాడు? తలకొట్టివేస్తాడా యేమిటి? వచ్చికూర్చో. (అని చేయి గట్టిగా పట్టుకొని లాగుచున్నాఁడు.)

సుమ—(తనలో) ఇతనికి పిచ్చ యెక్కువవుతూవున్నది. (బిగ్గరగా) అవును. మీరుచెప్పిందంతా నిజం. ఆయన మనను యేమీ చెయ్యలేడు. వచ్చి కూర్చుంటాను. నాచెయ్యి వదలండి.

సుబ—ఇదిగో వదలినాను.

సుమ—మీకు వంటయిందేమో కనుక్కొనివస్తాను. (అని చటుక్కున లోపలికిపోయి తలుపువేసికొనుచున్నది.)

సుబ—ఇదియేమిటి? (అని ఆశ్చర్యపడి నిలుచున్నాఁడు.

[రెండుగిన్నెలును, ఒకగరిటెయు పట్టుకొని రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాము—ఇదుగో మీకు ఔషధం-కాదు భోజనం తీసుకుని వచ్చినాను.

సుబ—ఆగరిటెలోది యేమిటి?

రాము—బుడంవరుగు. నేతిలో వేయించినాము.

సుబ—ఆగిన్నెలలోనో?

రాము—వకగిన్నెలోది మిరియాలచారూ. రెండోగిన్నెలోది పెసరట్టూను. పొట్టుతియ్యకుండా ముడిపెసలు నూరి రొట్టెలు చేసినాము.

సుబ—యేడిసినట్టేవున్నది యీభోజనం. ఈపాడురొట్టెలు యెవరికికావలెను?

రాము—కోపపడకండి. మీరు రెండురొట్టెలు ఫలహారంచేస్తే కడుపులోకొంచెం చల్లపడి శాంతిస్తుంది. భోజనం చెయ్యండి.

సుబ—(లేచి రాముని జుట్టుపట్టుకొని గట్టిగా ఊపి) నన్ను యీప్రకారంగా అడవిమృగంలాగు చూడడానికి యింట్లోవాళ్ళందరూ కలిసి యేదో కుట్రచేసినారోలేదో నిజంచెప్పు.

రాము—(జుట్టువదల్చుకొనుచు) నాజుట్టువదలండి. మృగంలాగు చూడడానికి కుట్రచెయ్యడంయేమిటి? మీరు నిజంగా ఆలాగే కనబడుతూవున్నారు. మీరు పెద్ద భల్లూకపుపట్టు పట్టినారు. అడవి మృగమైనా యింతపట్టుపట్టదు. మీరు నాజుట్టువదలకపోతే ఠాణాకు పోయి జంట్రోతును తీసుకునివస్తాను.

సుబ—నీఅవకతవకప్రసంగం మానకపోయినట్టయితే యిప్పుడు కాలుచేతకట్టి నిన్ను యింట్లోనుంచి అవతలికిసాగనంపుతాను. (తనలో)

బాగా ఆలోచిస్తే వీడితో విరోధంపడడం బాగాకనపడడంలేదు. కాకి వీడితో మంచిమాటలాడుతాను. వీడివల్లయేదైనాఉపయోగంవుంటుంది (బిగ్గరగా) రామూ! నేనువూరికే వేళాకోళానికి జుట్టుపట్టుకుని వూపినాను. అంతేకాని మరేమీలేదు. నీవు మహామంచివాడవుగా కనబడుతూ వున్నావు. ఇదిగో రూపాయియిస్తూవున్నాను పుచ్చుకో. (అని రూపాయిచేతిలోఁ బెట్టుచున్నాఁడు.

రాము—(పుచ్చుకొని సంతోషములో) మీరు మహాదొడ్డ వారు. మాయజమానులవంటివారు పదిమందైనా మీతో సమానం కారు.

సుబ—నాకు ఆకలిగావున్నది. తెచ్చినవి విస్తట్లోవడ్డించు.

రాము—(చిత్తము. అని రొట్టెలు విస్తరిలోవేసి నిలుచున్నాఁడు.)

సుబ—(విస్తరిముందు కూర్చుని) ఇవేమిటియీరొట్టెలు నల్లగా వున్నవి? వీటికంటె మరియేమయినా చేసినట్టయితే బాగావుండును. (అని తినుచున్నాఁడు.)

రాము—చెయ్యికరచుకుంటారు. జాగ్రతగాతినండి.

సుబ—చెయ్యి కరచుకోవడానికి నేను పసిపిల్లవాణ్ని అనుకున్నావాయేమిటి? రామూ! యివి బాగున్నవికావు. తినడానికి వీటి కంటె యేమయినా మంచివితెస్తూ.

రాము—మరేమీ తేవడానికి వల్లకాదు. అయ్యగారు యివి మాత్రమే మీకు పెట్టమన్నారు. యివన్నీ పైత్యహారపు వస్తువులు.

సుబ—అయ్యగారిని-(ఆపుకొని) పైత్యహారమూలేదు. యేమీ లేదు. మరియేమయినా తీసుకొనివస్తూ. నాకు వీటితో ఆకలి యేమాత్రమూ తీరలేదు.

రాము—అలాగా? (అని గరిటెయు గిన్నెలును తీసికొని పను రెత్తుచున్నాడు.)

సుబ—వీడు నేను గరిటెలూ గిన్నెలూ యెత్తుకునిపారిపోతా ననుకున్నాడు. కాబోలును. అవన్నీ వీడు యెంతతొందరగా తీసుకుని పోయినాడో? ఇక్కడిమోస్తరుచూస్తే నాకంతా విచిత్రంగాకనపడుతూ వున్నది. దాసీది పిచ్చదిగావున్నది. ఈరాముడు తెలివిమాలిన మోట పశువులాగు కనపడుతూవున్నాడు. నామరదలుకూడా నన్నుచూస్తే పెద్దపులినో వెలుగుబంటునో చూచినట్టు భయపడుతూవున్నది. ఇఖ నామామగారిసంగతి చెప్పనక్కరలేదు. ఆయనకు పాతుపొస్తకాలు చదవగా చదవగా మతిపోయింది. మహారాణిగారిని చూచినట్టు ఆయననాకేసి వూరికే రెప్పవాల్చకుండా చూడడం మొదలుపెట్టినాడు. ఆయనకు పిచ్చఅయినందుకు ఆవగింజంతయినా సందేహంలేదు. కాని సుమతిసంగతిమాత్రం నాకేమీ బోధపడడంలేదు. యిప్పుడు సుమతికి వకవుత్తరంవ్రాసి రాముడిచేత పంపిస్తాను. (అని వ్రాయుచు చదువు చున్నాడు—"అత్యంతప్రియురాలవైన సుమతీ! నన్నుచూస్తే నీకంత సిగ్గూ భయమూ రావడానికి కారణంయేమిటి? నీకు నామీద కోపం రావడానికి నేను యేమినేరంచేసినాను? నేనుచేసిన అపరాధం చెప్పినట్ట యితే నేను వెంటనే నీకాళ్ళమీదపడి క్షమాపణ కోరుకుంటాను. కాబట్టి నాయందుదయవుంచి విచారగ్రస్తుడనైవున్న నన్ను సంతోష పెట్టవలెనని మరీమరీ వేడుకుంటూవున్నాను. నీచిన్ననాటి ప్రియ మిత్రుడు సుబలుడు"—ఇది చాలును.

[పోకదొన్నెయు విస్తరియు చేతబట్టుకొని రాముడు ప్రవేశించుచున్నాడు.]

రాము—ఇదిగో మీకు పెసరట్టు మళ్ళీతెచ్చినాను. ఈసారి ఆకలికేరేటట్టుగా కావలసినన్ని తినండి. (తనలో) ఇప్పుడు గరిటెతీసి వేసి

దొన్నెలు తెచ్చినాను గనుక వీటితో యితడు యెవరికీ హానిచెయ్య లేడు. (అని క్రింద పెట్టుచున్నాడు.)

సుబ—(విస్తరిముందు కూరుచుండి) ఈమాటయినా మంచి రొట్టెలు తెచ్చినావా! వెండిగిన్నె లోపలపడవేసి యీవెధవదొప్ప తెచ్చినావేమి! లోపలకివెళ్ళి గిన్నెతీసుకునిరా. (అని పోకదొప్ప విసరి వేయుచున్నాడు.)

రాము—గిన్నెతీసుకునిరాను. మిమ్మలినినమ్మి మీచేతికి గిన్నె యివ్వడం క్షేమంకాదు. (తనలో) ఈయనచేతికి గిన్నెలూ గరిటెలూ యిచ్చి వాటితో నాతలబద్దలు కొట్టించుకుంటానా? నాకు అపాయం రాకుండా యెలా కాపాడుకోవలెనో నాకు బాగా తెలుసును. నేను మోసపోను.

సుబ—(కోపముతో) జాగ్రత. నన్నునీవు దొంగవాణ్నిగా భావిస్తూవున్నట్టున్నావు.

రాము—ఆసంగతి నాకేమీ తెలియదు. మీకది ముదిరితే అపాయం సంభవిస్తుంది. గనుక మీదగ్గిర గిన్నెలు మొదలయిన గట్టి వస్తువులు యేమీ వుంచవద్దని మీమామగారు సెలవిచ్చినారు.

సుబ—(కోపముతో) ఏదిముదిరితే—

రాము—మీకున్నజబ్బు.

సుబ—జబ్బేమిటి?

రాము—అయ్యగారు దానికేమిటో పేరుపెట్టినారు. జ్ఞాపకము చేసుకుని చెపుతానువుండండి. 'చిచ్చాబల్యం' జ్ఞాపకం వచ్చింది. అవును అదే.

సుబ—నీమొఖం చిచ్చాబల్యం యేమిటి?

రాము—దానికి యింకోపేరు "శిభ్రమ"

సుబ—మతిభ్రమ అనా నీతాత్పర్యం?

రాము—అవును. ఆమాట అదే.

సుబ—మొదటిమాట చిత్తచాంచల్యం కాబోలును.

రాము—నానోరు తిరగను. మీ మామగారు నాతో చెప్పింది యిప్పుడు మీరన్న మాటే.

సుబ—(నవ్వుచు) ఇప్పుడు నాకంతా బోధపడ్డది.

రాము—అవును మీకూ బోధపడ్డది. (అనినవ్వుచున్నాడు)

సుబ—(నవ్వుచు) ఈవింత బహుబాగావున్నది. ఆపిచ్చి ముసలాయన నాకు పిచ్చని యెందుకనుకున్నాడు?

రాము—ఏమో! నాకు తెలియదు.

సుబ—నీకు తెలియకపోతే పోయిందిగాని నీవు నాకు నక్క సహాయం చేసిపెడుతావా?

రాము—ఏమిసహాయం? మీచేతులూకాళ్ళూ కట్టిపెట్టవలెనా యేమిటి?

సుబ—అలాగంటి పనికాదు. నాకు మామామగారి విషయంలో వక్కతమాషా చెయ్యవలెనని వున్నది.

రాము—అయ్యో! పాపం ఆయనను—

సుబ—తొందరపడకు. మరేమీలేదు వారికే పరియాచకం అందులో నీవు సహాయంచేస్తే నీకు వకరూపాయి యిస్తాను.

రాము—అలాగైతే ఆలోచిస్తాను. ఆయన విషయంలోచేసేది యీపాస్తకాలు తగలపెట్టడంతప్ప మరేమీనాకు కనపడదు. ఈపుస్తకాలన్నిటనీ అగ్నిహోత్రుడికి సమర్పణచేస్తే నాకెంతో సంతోషంగా వుంటుంది. అలాచేస్తుమా నాశ్రమనివారణ అవుతుంది. వీటిపురుగులు మోయలేక చచ్చిపోతూవున్నాను—ఓ అగ్నిదేవుడా! నీకు నమస్కారం

చేస్తాను. ఈయన పాతతాటాకుల పుస్తకాలన్నీ పూర్ణాహుతిగా సమర్పిస్తారు గనుక, మీరువక్క పుస్తకమయినా మిగలకుండా కంఠపూర్తిగాభక్షించి నన్ను కృతార్థుణ్ని చెయ్యండి.

సుబ—చెయ్యవలసినపని మనం యిద్దరమూ కొంచెంసేపటిలో నిశ్చయింతాము గాని నీవు ముందుగా యీపుత్తరం తీసుకునివెళ్లి సుమతికియిచ్చిరా. యిదుగో రూపాయి (అనియిచ్చుచున్నాఁడు.)

రాము—(పుచ్చుకొని) రూపాయపుచ్చుకోవడానికి నాకేమీ అభ్యంతరం లేదు గాని పుత్తరంమాత్రం నేనుతీసుకుని వెళ్ళను. పుత్తరం ఆ ఆడదానిచేత పంపించండి.

సుబ—గౌరిచేతనా? అదినన్ను చూస్తే పరుగెత్తుతుంది. నా దగ్గరకేరాదు.

రాము—దానిచేతులో రెండణాలడబ్బులు పారవెయ్యండి. అప్పుడది కావలసినంత దగ్గరగా వస్తుంది. దానికి కావలసిందంతే.

సుబ—అలాగయితే దాన్ని వక్కసారి యిక్కడికి పంపించు.

రాము—నిముషంలో పంపుతాను. (అనివెళ్ళుచున్నాఁడు.)

సుబ—ఒంటరిగా నేను ఆలోచించింది. బహుబాగావున్నది. వీరందరూ కలిసి వస్తే కాస్తసేపటిలో తమాషాచేస్తాను. రాముణ్ని బెదరకొట్టకూడదు. వీడుయిందులో చాలా పనికివస్తాడు. అదుగో అప్పుడే గౌరివస్తూవున్నది.

[బెదరి బెదరిచూచుచు గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి—అయ్యా! రాముడు మీరు యెందుకో నన్ను రమ్మన్నారని చెప్పినాడు.

సుబ—అవును. యీపుత్తరం సుమతికి తీసుకుని వెళ్ళడం నిమిత్తం పిలువమన్నాను. అటువంటి సౌందర్యవంతురాలికి పుత్తరం తీసుకుని వెళ్ళడానికి నీవంటి అందగత్తెలు తప్ప యితరులు తగరు.

గౌరి—(తనలో) ఇతణ్ణి పిచ్చవాడంటారేమి? ఈయన మహా రాజులాగు మాట్లాడుతూవున్నారు.

సుబ—(ఉత్తరము చేతికిచ్చి) యీవుత్తరం తీసుకునివెళ్ళి నీయజమానురాలికియ్యి. యిదుగో నీబహుమానము. (అని నాలుగు అణాలిచ్చుచున్నాఁడు.)

గౌరి—(సంతోషముతో) వుత్తరం యిచ్చివస్తాను. వుత్తరం తీసుకుని వెళ్ళినప్పుడల్లా యిలా బహుమానం యిస్తూవుండవలెను.

సుబ—నీవు బహుమంచిదానవు. అలాగే యిస్తూవుంటాను. వేగిరంవెళ్ళు (అని వీపుమీద తట్టుచున్నాఁడు.)

[అప్పుడు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(తనలో) అదుగో సుబలుడు దాన్ని కొడుతూవున్నాడు నేను మళ్ళీ యోగదృష్టితో చూచి శాంతపరచవలెను.

గౌరి—(చూచి పరుగెత్తుచు) అదుగో! అయ్యగారు వస్తూవున్నారు. (అని వెళ్ళుచున్నది.)

సుబ—ఆవెర్రివాడా? (అని మరియొకదారిని వెళ్ళుచున్నాఁడు.)

మతి—అయ్యో! కుర్రవాడు తప్పించుకొని పోయినాడు. పిచ్చ యింతవేగంగా హెచ్చిపోవడం నేను యెక్కడాచూడలేదు.

[రాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

రాము—అయ్యా! మీకోసం యెవరో యిద్దరు పెద్దకుంకం బొట్లు పెట్టుకునివచ్చి వాకిట్లోనిలుచుని వున్నారు. వారినిచూడడంతోటే దెయ్యాలపోతులేమోనని నాకు భయంవేసింది.

మతి—వారువైద్యులయి వుంటారు. సందేహంలేదు. వారిని లోపలికి తీసుకునిరా.

రాము—అదుగో వారేవస్తూవున్నారు.

[సదానందయోగియు, గజాననదాసును ప్రవేశించుచున్నారు]

మతి—(సుబలుని కొఱకు నాలుగుదిక్కులనుజూచి) మావాడు యిప్పుడు యెలాగో వెళ్ళినాడు. సందేహంలేదు. అతను మళ్ళీ యిప్పుడే వస్తాడు. రావడంతోటే అతణ్ని మీకు చూపిస్తాను. మీరు బహు జాగ్రతగా వుండవలెను. పయికిచూడడానికి అతనంత పిచ్చివాడుగా కనపడడుగాని యీవ్యాధి మీవంటి ఘనవైద్యులు చక్కగా శోధించ తగ్గదని తలుస్తాను.

సదా—మీరు చెప్పినదాన్ని పట్టిచూస్తే మీవాడికి పైత్య చలనమని నిశ్చయిస్తాను.

గజా—క్షమించవలెను. అది పైత్యచలనంకాదు. భూతావేశ మని నేను భావిస్తాను.

సదా—మీరు మహాబాగా కనిపెట్టినారు. (తనలో) ఇతనికి యేమీ తెలియదు.

గజా—(తనలో) యేమీ తెలియకపోయినా యితడన్నీ తనకే తెలుసునంటాడు.

మతి—మీరతణ్ని సావకాశంగా పరీక్షచేసి చూడవచ్చును. మీరు వైద్యులనిచెప్పక నాస్నేహితులని మాత్రముచెపితే అతను మీతో మనసిచ్చి మాట్లాడుతాడు. అలాచేస్తే బాగావుండదా?

సదా—దివ్యంగా వుంటుంది.

గజా—బాగానేవుంటుది.

మతి—అతని విషయంలో మీరు బహుజాగ్రతగా వుండ వలెను. వొక్కొక్కప్పుడు అతనికి పిచ్చికోపంవస్తుంది. అలాగ

టప్పుడు అతను వళ్ళూ పై తెలియకుండా దౌర్జన్యంచేస్తాడు. యింకాకా మానవుకరునూ దాసీదాన్నీ కొట్టినాడు. అయితే నేను వెంటనేవచ్చి యోగదృష్టితో చూచేటప్పటికి అవుద్రేకమంతాపోయి నిముషంలో శాంతపడిపోయినాడు. మీకేమైనా తొందరకలిగితే నన్ను వెంటనే పిలవండి. నేను వచ్చి యోగదృష్టితో చూచి తక్షణం శాంతుణ్ని చేస్తాను.

సదా—ఈవిషయంలో నాకు మీసహాయం అక్కరలేదు. అది మేము నిత్యమూచేసేపనే. అడుగో! ఆవచ్చేది అతనేకాబోలును.

[సుబలుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(రహస్యముగా) అవును. అతనే (సుబలునితో బిగ్గరగా) అబ్బాయీ! వీరిద్దరూ నాస్నేహితులు. బహుతెలిసినవారు. గొప్ప విద్వాంసులు.

సదా—(మతిమంతునితో రహస్యముగా) ఆముఖలక్షణం చూడగానే నాకు పైత్యచలనమయినట్టు నిశ్చయంగా తోడకట్టుతూ వున్నది.

గజా—(మతిమంతునితో రహస్యముగా) అతని చూపువల్ల యిది గ్రహలక్షణమయినట్టు నాకు స్పష్టపడిపోయింది.

మతి—(ఇద్దరితోను రహస్యముగా) మీరిద్దరూ ఆలోచించుకొని యేదోనిశ్చయం చెయ్యవలెను. యిఖమిమ్మలిని యిద్దరినీ యితనివద్ద విడిచి నేను వెళుతాను. (సుబలునితో బిగ్గరగా) అబ్బాయీ! నేను వక్కసారి లోపలికివెళ్ళి వస్తాను. ఈలోపుగా నీవు వీరియిద్దరితోనూ మాట్లాడుతూవుండు. వీరు బహుమంచివారు. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుబ—(తనలో) ఈముసలివాళ్ళు యిద్దరూ నాకేసిచూచి యేమో ఆలోచిస్తూవున్నారు. వీరుకూడా మామామగారి యోగపు పిచ్చిలో

చేరినవారనుకుంటాను. (బిగ్గరగా) అయ్యా! దయచెయ్యండి. నేను యీ వూరు మంచిదనుకుంటాను.

సదా—బహుమంచిగ్రామం.

గజా—ఇక్కడ సమస్త సదుపాయాలూ వున్నవి.

సుబ—ఈయేడు పంటలు బాగావున్నవా?

సదా—బాగానే వున్నవి.

సుబ—మీకేమయినా నల్లమందు వెయ్యడం అలవాటు వున్నదా?

సదా—లేదు. మిమ్మల్ని మేము కొన్ని ప్రశ్నలను వెయ్యవలెనని వున్నది. అడుగవచ్చునా?

సుబ—అడగవచ్చునుగాని నేనేముందుగా కొన్ని ప్రశ్నలు వేస్తాను. వాటికి జవాబుచెప్పండి. మాతండ్రిగారి మేనమామకొడుకు మీతల్లిగారి మేనత్త మనమడైనట్టయితే, అతను పూజారి జాంబవంతుడికి యేమవుతాడు?

సదా—యేమీకాడు.

సుబ—యేమీకాకపోతే నన్ను మీరు యిలాగంటి సందర్భం మాలిన ప్రశ్నలు మాత్రం వెయ్యకండి.

సదా—(తనలో) నేననుకున్నట్టే యితనికి తప్పకుండా పైత్యచలనమే. (బిగ్గరగా) మీరేమీ సందేహపడవలసిన పనిలేదు. మేమటువంటి ప్రశ్నలు వెయ్యము. ఏమండీ! గజాననదాసుగారూ! మీరేమంటారు?

గజా—యెంతమాత్రమూ వెయ్యము. (తనలో) ఇది భూతలక్షణమే సందేహంలేదు.

సుబ—అలాగయితే ప్రారంభించండి.

సదా—మీవూళ్లో వింతవర్తమానాలు యేమయినావుంటే చెపుతారా?

సుబ—(తనలో) వీళ్ళువర్తమానపత్రికలకు వ్రాసేవాళ్ళు కాబోలును. వీళ్ళకు తగినట్టుచెపుతాను. (బిగ్గరగా) మా వూళ్లోవక లేగదూడ అయిదుకాళ్ళతో పుట్టింది. వకముసలావుకు మూడుకొమ్ములువున్నవి.

సదా—(తనలో) దీనితో యితనికి పైత్యలక్షణమయినట్టు స్థాపనఅయినది. అయినాకానీ యింకొక్క ప్రశ్నకూడా అడిగిచూస్తాను (బిగ్గరగా) ఇవివింత సమాచారాలే. రామాయణంవిన్నారుగదా రాముడికి సీత యేమవుతుందో చెప్పగలరా?

సుబ—(తనలో) వీళ్ళునన్ను పిచ్చివాణ్ని చేసి ఆడించవలెననుకుంటూవున్నారు. వీళ్ళకు బుద్ధివచ్చేటట్టు జవాబు చెపుతాను. (బిగ్గరగా) మీకు యీయన అయినట్టే రాముడికి సీత మేనమామమొగుడవుతుంది. తెలిసిందా?

సదా—(తనలో) ఇఖప్రశ్నలక్కరలేదు. ఇప్పుడు పిచ్చస్థిరపడ్డది.

గజా—(తనలో) ఇతణ్ని యిప్పుడు దెయ్యం సంపూర్ణంగా ఆవహించి వున్నది. (బిగ్గరగా) అయ్యా! యోగిగారూ! మీసెలవైతే నేనుకూడా యీచిన్నవాణ్ని వకటి రెండుప్రశ్నలు అడుగుతాను. అబ్బాయీ! యిప్పుడు మీ యెదుట యెవరైనా నిలుచున్నట్టు కనపడుతూ వున్నారా?

సుబ—కనపడుతూవున్నారు. మీరుయిద్దరూ నిలుచున్నట్టు కనపడుతూ వున్నారు.

సదా—అబ్బాయీ! మిమ్మల్ని నేనువక్కప్రశ్న అడుగుతాను గాని మరివకలాగు అనుకోక సరిఅయిన జవాబు చెప్పండి. మీ తండ్రి గారికి యెప్పుడయినా పైత్యభ్రమ వుండేదా?

సుబ—(తనలో) వీళ్ళుబుద్ధిమాలిన ప్రశ్నలువేస్తూవున్నారు. అయినాకానీ యింకాయేమి అడుగుతారో వక్కనిముషం వోపికచేసి వింటాను. (బిగ్గరగా) లేదు.

సదా—పోనీ. మీబంధువులలో యెవరికైనా వున్నదా?

సుబ—వున్నది. మామేనమామగారికి యోగవుపిచ్చవున్నది. (తనలో) ఇకనేనీ పాడుప్రశ్నలకు జవాబు చెప్పలేను. నిద్రవచ్చినట్టు నటిస్తాను. (అని గోడకుఁ జేరగిలఁబడి కన్నులుమూసికొనుచున్నాఁడు)

సదా—(దగ్గిరకుపోయి మెల్లగా చేయిపట్టుకొని చూచి) చేతిలో పైత్యనాడి బాగా ఆడుతూవున్నది. గజాననదాసుగారూ! మీరుకూడా చూడండి.

గజా—(చేయిపట్టుకొనిచూచి) యిదిపైత్యనాడికాదు. తప్పకుండా భూతనాడి ఆడుతూవున్నది. ఇది గ్రహాలక్షణం.

సుబ—(కన్నులువిప్పిలేచి) మీరునాకు నిద్రాభంగం కలుగచేస్తూవున్నారు. మీరు తక్షణం యీగది విడిచి వెళ్ళకపోయినట్టయితే మిమ్మలిని కొట్లోపెట్టి తాళం వేస్తాను. (అని ముందుకువచ్చుచున్నాడు)

ఇద్దఱు—(చేతులడ్డము పెట్టుకొని వెనుక వెనుకకు నడుచుచు) తాళండి వెళుతూవున్నాము. (అని గుమ్మముచేరి పరుగెత్తుచున్నారు.)

సుబ—వేగిరంవెళ్ళకపోతే యీపొస్తకాలకట్ట పుచ్చుకుని నెత్తి పగలవేస్తాను. (అని రెండుచేతులతోను రెండుతాటాకుల పుస్తకములు విసరివేయుచున్నాఁడు) దెబ్బతగలలేదు. వాళ్ళు తప్పించుకుని పారి పోయినారు. ఇకి నేను యీయింట్లోవుండకూడదు. యీవ్రాళ్ళే యింకో

మందీ పిచ్చివాళ్ళు బహటంగా తిరుగుతూ వుశేుపట్టుకోకుండా పోలీసు వాళ్ళు యేమిచేస్తూవున్నారు? నేనుయిప్పుడు మా ముసలి పిచ్చాయ నను తీసుకుని వెళ్ళి స్టేషనులో వప్పగించి ఆయనకూతురిని తీసుకునిశేచి పోతాను. సుమతి కూడా నేను కనపడినప్పుడల్లా యేదోవింతగా చూస్తుంది.

[సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—(కలయఁజూచి) యీపుస్తకాలన్నీ యిలాగు పారవేసి వున్నవేమి?

సుబ—సుమతీ! యీపుస్తకాలా?

సుమ—(తనలో) ఇతడే పారవేసినట్టున్నాడు. నన్నేమిచేసి పోతాడో అని నాకు భయంవేస్తూవున్నది. (అని పరుగెత్తఁబోవు చున్నది.)

[తేటిపాటచూచుచు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—అమ్మాయీ! భయపడకు. అబ్బాయీ కొంచెం శాం తించు. పుక్తకాలు పాడుచెయ్యకు. (అని యాతనివంక రెప్పవాల్చక చూచుచున్నాఁడు)

సుబ—మామా! అంతాచెపుతాను వినండి. నేను మహానెమ్మ దైనవాణ్ని. నాకు సాధారణంగా కోపంరాదు. యీయింట్లో జరు గుతూ వున్న పిచ్చిపనులవల్ల నావంటి శాంతుడికికూడా కోపంవస్తూ వున్నది. యికనైనా మీరు యీపిచ్చిపనులు కట్టిపెట్టకపోతే మిమ్మ లిక్కడా మెడపట్టుకుని అవతలికి గెంటివేస్తాను.

మతి—(చిఱునవ్వుతో రెప్పవాల్చక చూచుచు) సుబా! కొంచెం శాంతించు. (తనలో) యిప్పుడు లొంగుబాటులో లేదు. పోలీసుబంట్రోతువస్తే బాగా వుండును.

సుబ—శాంతిస్తాను. (అని మీదికి వచ్చుచున్నాఁడు.)

సుమ—బావా ముసలాయనజోలికి రాకు. (అని యిద్దఱికిని నడుమ వచ్చుచున్నది.)

మతి—అమ్మాయీ! అడ్డంరాకు. నాకు భయంలేదు. నన్ను యోగదృష్టితో చూడనియ్యి.

సుబ—ఓప్రియురాలా! నీవేమీభయపడకు. నీతండ్రికి నేనేమీ అపాయంచెయ్యను. మామగారూ! నేను వక్కనిముషం మీకొమార్తెతో మాట్లాడవలెను. దయచేసి మీరు వక్కపర్యాయం అవతలికి వెళ్ళండి. (అని సుమతిని ముందుకులాగుకొని, మతిమంతుని మెల్లగా గుమ్మమువద్దకు త్రోసికొనిపోయి యావలకుఁ బంపి తలుపు వేయుచున్నాఁడు.)

సుమ—అయ్యో! మానాన్నగారు—

సుబ—సుమతీ! నీవికారపుచేష్టలుమాని వక్కనిముషం నాతో నెమ్మదిగా మాట్లాడు. యిలావచ్చికూర్చో. నాకేసి బెదరిచూడకు. నాహృదయేశ్వరీ! భయంమాని నేను యిప్పుడు తరిమివేసిన యిద్దరు ముసలివాళ్ళూ యెవరో చెప్పు.

సుమ—(కూరుచుండి) వారు పిచ్చివైద్యులు.

సుబ—వాళ్ళు పిచ్చివాళ్ళని నేను చూడడంతోటే అనుకున్నాను.

సుమ—నాకేమీ పిచ్చిలేదు. వారు పిచ్చికుదిర్చే వైద్యులు. నీపిచ్చి మొదలంటా కుదిర్చేనిమిత్తం వారు వచ్చినారు.

సుబ—యేడిపించినావుటే. సుమతీ! భయపడకు. కొంచెము నాకేసి మొగంయెత్తి చూడు. మన బాల్యస్నేహమంతా యీనాలుగు సంవత్సరాలలోనే మరిచిపోయినావా?

సుమ—(అతనివంక చూచుచు) బావా! నీకు నిజంగా పిచ్చి వున్నదోలేదో చెప్పు.

సుబ—నీకలాగంటి సంశయం యెందుకు కలిగింది?

సుమ—తల్లి పోయినప్పటినుంచీ మీ మేనల్లునికి విచారంచేత పిచ్చి యెత్తిపోయిందని మానాన్నగారిపేర మీ బాబయ్యగారే వ్రాసినారే.

సుబ—దానికర్థంస్పష్టంగా తెలుస్తూనేవున్నది. విచారంచేత పిచ్చియెత్తిపోయిందంటే దుఃఖంచేత యేమీతోచకుండా వున్నదని అర్థంనీకు బోధపడలేదా? నన్ను చూచినతరువాత యిప్పుడైనా నాకు పిచ్చిలేదని నీకు నిశ్చయంకలిగిందా లేదా?

సుమ—నీవు యిప్పుడు మంచివాడవులాగే కనపడుతూవున్నావు.

సుబ—అలాగైతే నిన్ను వక్కప్రశ్న అడుగుతాను. నిజం చెప్పు. నిన్ను మీనాన్నగారు యెవరికైనాయిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించినారా యింకాలేదా?

సుమ—(తలవంచుకొని) యింకా యెవరికీ యివ్వడానికి నిశ్చయం చెయ్యలేదు.

సుబ—అలాగయితే నన్ను వివాహం చేసుకోడానికి నీకు యిష్టంవున్నదా? మనం యిద్దరమూ మేనత్తమేనమామ బిడ్డలమూ బాల్యస్నేహితులమూ మాత్రమేకాకుండా యేకశరీరులముకూడా కావలెనని నాకు కోరికవున్నది. వేగిరంచెప్పు.

సుమ—నేను ఆలోచించుకొని చెప్పుతాను.

సుబ—ఆలోచనా లేదు యేమీలేదు. చెప్పుకో.

సుమ—నీవు యీసంగతి మామగారిని అడగవలెను.

సుబ—ఆయన వప్పుకోడు. ఆయన యిప్పుడు నన్ను చేసిన అవమానానికి నేను తగినపని చేస్తాను.

సుమ—నీవు అలాగంటిపని యెంతమాత్రమూ—

సుబ—తొందరపడబోకు. నిజంగా నేను యేమీచెయ్యను. పరియాచకానికి వక్క తమాషాచేస్తాను. ఇందులో నాకు నీవుకూడా సహాయంచెయ్యవలెను.

సుమ—అదేమిటో అంతా నాతో చెప్పు.

సుబ—ముందుగా చెప్పడానికివల్లకాదు. కాని కొంచెంసేపటికి నీకదంతా తెలుస్తుంది. ఆయననన్ను పిచ్చవాణ్నిగా కట్టివేసినాడు. అయన విషయంలో ఆపని నేనుచేస్తే ఆయనకు యెలాగువుంటుందో చూతాము.

సుమ—ఆయనకు యేమీశరీరబాధమాత్రం చెయ్యకు. ఆయన పిలుస్తూవున్నారు. నేను తలుపుతీసి లోపలికి వెళ్ళిపోతాను. (ఆ ప్రకారముగా చేయుచున్నది.)

[మంగలికత్తి చేతఁబట్టుకొని మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(తనలో) నేను యిప్పుడు యితనికి తలగొరగవలెను. లేకపోతే పిచ్చ నిమ్మళించదు.

సుబ—(తనలో) ఇతడు మంగలికత్తి తెచ్చినాడు. గొంతుకకోస్తాడాయేమిటి? (బిగ్గరగా) మామా! ఆగండి. ఆచేతిలోనిది దూరంగా పెట్టండి.

మతి—(తనలో) ఇతనికప్పుడే అనుమానం కలిగింది. యేమైనా పాటుగా వున్నప్పుడు ఆపనిచెయ్యవలెను. (బిగ్గరగా) అబ్బాయీ! నా దగ్గరగా వచ్చికూర్చో.

[గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి—(మతిమంతునితో) అయ్యా! తమకోసం యెవరో తమా షావేషం వేసుకుని వకమనిషివచ్చినాడు. (అని తనలో నవ్వుకొనుచు సుబలునికి చేసైగచేయుచున్నది.) అతను ఠాణానుంచి వచ్చినానని చెప్పినాడు.

మతి—అతణ్ని లోపలికి తీసుకునిరా. తక్షణం తీసుకునిరా. (తనలో) సందేహంలేదు. అతనుపోలీసు బంట్రోతు. అతను మంచి సమ యంలో వచ్చినాడు. అతను యితనితల గట్టిగాపట్టుకుంటే యీకత్తితో నేను క్షవరంచేస్తాను. (అని కత్తిపయికి తీయుచున్నాఁడు.)

గౌరి—యిప్పుడే తీసుకునివస్తాను. (అని వెళ్ళుచున్నది.)

సుబ—(మతిమంతుని మొగమువంక చూచుచు) ఈముసలాయ నకు నిజంగానే పిచ్చిఅనుకుంటాను.

[మొగము కనఁబడకుండ ఎఱ్ఱతలగుడ్డ వికారముగా చుట్టుకొని రాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—ఇఖ నేను సిద్ధంగావుండవలెను. (అని కత్తి క్రిందపెట్టి బట్ట సవరించుకొనుచున్నాఁడు.)

సుబ—ఇదుగో రాముడు వచ్చినాడు. నాఅదృష్టం బాగా వున్నది. (అని రామునకు చేసైగచేయఁగా రాముఁడు మరల సైగ చేయుచున్నాఁడు.) మామా! ఈమనిషివేషం బహువిచిత్రంగా వున్నది. యితడు యిక్కడికి యెందుకువచ్చినాడు?

మతి—యెందుకూలేదు. వూకికేవచ్చినాడు. యితడుగారికీ చేస్తాడు. (అని రామునిదగ్గరకుపోయి సుబలునిచూపి సైగచేసి మెల్లగా)

నేను పట్టుకోవడానికి కబురు పంపించిన చిన్నవాడుయితడే. నీవు భయ పడకుండా గట్టిగాపట్టుకోవలెను.

రాము—మీరుముందు నడవండి. ముసలివారుమీరే భయపడక పోతే నేను భయపడుతునా?

మతి——(రామునితో) నేను యోగదృష్టితో చూచి అతణ్ని కదలమెదలకుండా చేస్తాను. అతడు నిశ్చేష్టితుడై చిత్రప్రతిమలాగు వున్నప్పుడు నీవువెళ్ళి పట్టుకోవలెను.

రాము——మీ యోగదృష్టి గీగదృష్టి యేమీ నాకు సహా యం అక్కరలేదు. నేను సిద్ధంగా వున్నాను.

మతి——నేనా కుర్చీతెచ్చి యితనికి యెదురుగా వేసుకుని కూర్చుంటాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుబ——(రామునితో) అతడు కుర్చీలో కూర్చోవడంతోటే నీవు వెనుకనుంచి తాళ్ళువేసి వెంటనే కట్టవలెను.

రాము—మంచిది. అలాగేచేస్తాను. ఇయిగో త్రాళ్ళు నాచేతులో సిద్ధంగానే వున్నవి. (అని చూపుచున్నాఁడు.)

మతి——(కుర్చీతెచ్చి సుబలునకెదురుగా వేసికొని కూరుచుండి రెప్పవాల్చక సుబలునిచూచుచు) అబ్బాయీ! జాగ్రతగాకూర్చో. (అని వెనుకతిరిగి రామునికి సైగలుచేయఁగా సుబలుఁడుకూడ సైగలు చేయుచున్నాఁడు.) అబ్బాయీ! నీవు యిందాకా చాలా దురుసుగా వున్నావు. ఇప్పుడు నెమ్మదిపడ్డావనుకుంటాను. (అని రెప్పవాల్చక మరల సుబలుని చూచుచున్నాఁడు.)

సుబ——అవును. (అని కన్నులరమోడ్చి కుర్చీకిఁ జేరగిలఁబడి కూర్చుండి నిద్రపోయినట్టు నటించుచున్నాఁడు.)

మతి——(వెనుకకు చూచుచు) ఓరి బుద్ధిహీనుడా! ఇందులో నీవు పొరపాటుపడి వకరినికట్టడానికి వకరినికట్టినావు.

రాము—వూరికే పెనుగులాడకండి. నేనుయెప్పుడూ పొరపాటు పని చేసేవాణ్నికాను. (అని మరింతగట్టిగా బిగించి కట్టుచున్నాఁడు.)

మతి—(కోపముతో) ఇదేమిపని? నేను చెప్పినాకానీ నీకుబుద్ధి రాకుండావున్నదేమి? పిచ్చివాణ్ని నేనుకాను. నాకుయెదురుగా కుర్చీమీద కూర్చున్న అతడు పిచ్చివాడు.

రాము—(అద్భుతపడ్డట్టు తలయూచుచు) పిచ్చవాళ్ళు యెప్పుడూ యిలాగే అంటూవుంటారు.

సుబ—నాకు బహువిచారంగా వున్నది.

రాము—నాకూ విచారంగానేవున్నది. అయినాకానీ పిచ్చవాళ్ళ విషయంలో చెయ్యవలసినపని చెయ్యకతప్పదు.

మతి—(ఆగ్రహముతో) ఓరిపశువా! నేను పిచ్చవాడనుట్రా? (అని పండ్లుపటపట కొఱుకుచున్నాఁడు.)

రాము—ఇతనిది సాధారణమయిన పిచ్చకాదు. నేను యింతమంది పిచ్చవాళ్ళను చూచినానుగాని ముసలితనంలో యిలాపళ్ళుకొరికే పిచ్చి నేను యిదివరకు యెక్కడా చూడలేదు. మీరేమంటారు?

సుబ—అవును. ఇది బహుప్రబలమయిన పిచ్చ.

మతి—సుబలా! నీవు పిచ్చలోవుండి యీదౌర్జన్యంలో నీవు నాకు యేమీసయం చెయ్యలేని స్థితిలోవున్నందుకు నాకు బహువ్యసనంగావున్నది.

సుబ—నాకూ వ్యసనంగావున్నది.

రాము—ఈపిచ్చాయనతో మాటకుమాట జవాబుచెప్పకండి.

మతి—ఓరామా! ఓసుమతీ! ఓగౌరీ! వేగిరంవచ్చి నన్ను వదలించండి. అని పెనఁగులాడుచు కేకలు వేయుచున్నాఁడు.)

[సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—అయ్యో—

మతి—(వికారముగా కాళ్ళను చేతులును గింజుకొనుచు) అమ్మాయీ! సుమతీ! రా. వేగిరంరా. నాకట్లువిడిపించు. పిచ్చివాణ్ని నేనుకానని యీపశువుతో చెప్పు.

సుమ—(ఏడ్చుచు) అయ్యో! గొప్పవిపత్తువచ్చింది. యీమధ్య మీచేష్టలుచూచి యెప్పుడో యింతగతి పడుతుందని నేను యిదివరకే భయపడుతూవున్నాను.

రాము—అమ్మా! యెందుకు విచారిస్తావు? పిచ్చవాణ్నికట్టి వేస్తే క్షేమమేకాని యెవరికీ విపత్తులేదు.

మతి—(కన్నుఎఱ్ఱచేసి పండ్లుపటపట కొఱుకుచు) పరమనిర్భాగ్యురాలా? బుద్ధిలేకుండా నీవుకూడా నీతండ్రికి పిచ్చఅంటూ వున్నావా? చూడునిన్ను—(అని ముందుకు జరగుచున్నాడు.)

సుమ—(పరుగెత్తి) సుబలా! నన్ను రక్షించు. ఓరీ! అబ్బీ! నీవు అయినను గట్టిగా పట్టుకుని నామీదికి రాకుండా చెయ్యలేవా?

రాము—చేస్తాను. మనయింట్లో చేంత్రాడు యెక్కడవున్నది?

మతి—(కోపముతో) ఓరిశుద్ధమున్నపోతా! నీకండకావరం—

రాము—ఈయనను చూడండి. ఈయనపని యిలాకుదరదు. అయ్యా! సుబలా! ఈయనకు క్షవరం చేసి నిమ్మకాయల పులుసు పట్టించి నీళ్ళుపోస్తేనేకాని ఈ వుద్రేకం తగ్గదు.

సుబ—అలాచేతాము. దీనితో పిచ్చబొత్తిగా పోకపోయినా కొంచెం శాంతి కలుగుతుంది. (అని క్రిందనున్న మంగలికత్తి తీయ బోవుచున్నాడు.

మతి—(మరింత గట్టిగా గింజుకొనుచు) సందేహంలేదు. శిష్యు యిప్పుడునన్ను చంపివేస్తారు. వక్కసారి నేను వీళ్లను యోగదృష్టితో చూచి స్తంభింపజేస్తినా—

[సుబలుఁడును రాముఁడును మతిమంతుని తలగొట్టుటకు సిద్ధ
పడుచుండఁగా సదానందయోగియు గజాననదాసును
ప్రవేశించుచున్నారు.]

సదా—(గజాననదాసుతో) ఇది మరీవింతగావున్నది.

సుబ—(వెనుకతిరిగి వారినిచూచి) ఇదుగో యీయన పిచ్చ స్నేహితులుకూడా వచ్చినారు. రామా! వక్కనిముషం ఆగు.

రాము—ఈలోగా నీళ్ళతో తలతడుపుతూవుంటాను.

సుబ—వద్దువద్దు. (అని మతిమంతుని వెనుకవైపుననున్న సదానందయోగి గజాననదాసులవద్దకు వెళ్ళుచున్నాఁడు.)

రాము—మంచిది. (అని వెనుకతిరిగి చూడకుండ మతిమంతుని కుర్చీలో నదిమి పట్టుచున్నాఁడు.)

సుబ—(అవైదులచేతులు పట్టుకొని) మీరు మంచిసమయంలో వచ్చినారు. మీరాక నాకు బహుసంతోషంగావున్నది.

సదా—నాకూ సంతోషంగానేవున్నది.

గజా—నాకూనూ.

సుబ—మీరు యిటువంటి ఘనవైద్యులన్నమాట నాకు మొట్ట మొదట తెలియలేదు. మీరు యిద్దరూ ధన్వంతరియొక్క అపరావతారాలు.

సదా—ఈచిన్నవాడు చాలాబుద్ధిమంతుడులాగు కనపడుతూ వున్నాడు.

గజా—అయ్యా! మీరు మహాసరస్సులు.

మతి—(వారి కంఠస్వరముగుఱుతుపట్టి) ఓసదానందయోగీ! గజాననదాసా! మీరు యిదిచూచినారుగదా? నన్ను మీరు చూడ గలరుగాని మిమ్మలిని నేను చూడలేను. మాయింట్లోవున్న వారందరికీ వక్కసారిగా పిచ్చయెత్తిపోయింది. ఈపశుప్రాయుడు పోలీసువాడి వేషంవేసుకునివచ్చి నన్ను కట్టివేసినాడు.

సుబ—అయ్యా! మా మామగారు యెటువంటిదురవస్థలో వున్నారో మీరు చిత్తగించినారా?

రాము—యెవరికీ హానికలుగకుండా తన్ను కాపాడుతూవున్న వాణ్ని నన్ను యెలాగు దూషిస్తూవున్నారో చూచినారా?

సదా—ఇదుగో వచ్చి చూస్తాము. (అని వారిద్దరును చేరువకు రాఁగా రాముఁడు ముందుకు వచ్చుచున్నాఁడు.)

మతి—ఇప్పుడు కన్నులయెదటికివచ్చినావు. ఇక యోగదృష్టితో చూచి నిన్ను నిముషంలో నాస్వాధీనం చేసుకుంటాను. (అని రాముని వంక రెప్పవాల్చక చూచుచున్నాఁడు.)

రాము—మీమంత్రం పారకుండా నేనూ మిమ్మలిని యోగ దృష్టితో చూస్తాను. (అని గ్రుడ్లు పెద్దవిచేసి తేఱిపారచూచు చున్నాఁడు.)

సదా—(మతిమంతుని వంకచూచి) ఈయన వెఱ్ఱిచూపులు చూస్తూవున్నాడు. గుడ్లు పెద్దవయినవి. ఇది పిచ్చకావడానికి సందేహం లేదు. నేను మొదటినుంచీ యీయనకు యెప్పుడో పిచ్చయెత్తుతుందనే అనుమానపడేవాణ్ని.

గజా—(మతిమంతుని తేఱిపారచూచి) ఆ ముఖచిహ్నాలనుబట్టి చూస్తే యిది భూతావేశంగా తోస్తూవున్నదిగాని చూపులలో పిచ్చ లక్షణం యెంతమాత్రమూ కనపడడంలేదు.

సదా—మనం నాడికూడా పరీక్షచేసిచూతాము.

రాము—అయ్యా! వైద్యులు చెయ్యిచూస్తారట. మీచెయ్యి వక్కమాటు చాపండి.

సదా—అయ్యా! కుడిచెయ్యి యిలాగివ్వండి. (అని మణికట్టు పట్టుకొనుచున్నాఁడు.)

గజా—ఎడమచెయ్యి నాచేతికియ్యండి. (అని పట్టుకోఁబోవు చున్నాఁడు.)

మతి—(చేయివదల్చుకొని గింజుకొనుటచేత కట్టినత్రాళ్ళు కొంచెము వదులుకాఁగా కుర్చీతోలేచి) ఓముసలిగాడిదె కొడుకుల్లారా! మిమ్ములిని యిద్దరినీ తలబద్దలుకొడుతాను వుండండి. నాకుకాదు మీకే పిచ్చయెత్తింది. అని యిద్దఱిని చెఱియొక గుద్దును వేయఁగా వారు పరుగెత్తుచున్నారు.)

రాము—(మతిమంతుని కుర్చికాళ్ళు పట్టుకొని వెనుకకు లాగుచు) మీకు భయంలేదు. మెల్లిగా పరుగెత్తండి.

మతి—పిచ్చికుక్కలకొడుకుల్లారా! పారిపోకండి. (అని కుర్చీతో రాముని వారికేసి యీడ్చుచు రాముఁడును తానును ముందుకు పడు చున్నారు.)

సుబ—అయ్యో! (అని నవ్వాపట్టలేక నోటికి చేయడ్డము పెట్టు కొని క్రిందకూలఁబడుచున్నాఁడు.)

సుమ—అయ్యో! (ఏడ్చుచు తండ్రికి సహాయపడుటకు పరుగెత్తు చున్నది.)

రాము—నామోకాళ్ళు విరిగిపోయినవి. (అని లేచి సుమతి సహాయముతో మతిమంతుని కుర్చీకట్లు విప్పుచున్నాఁడు.

సుమ—బాబయ్యగారూ! మీకు దెబ్బతగలలేదుగదా? సుబలా! నీవు నట్టి అల్లరివాడవయినావు. (రాముని మొగమువంకచూచి) ఓసీ! వీడు మనరాముడేనా! తలగుడ్డా వేషమూ చూచి యెవరో అనుకున్నాను.

మతి—(మెల్లగాలేచి) రాముడా? వీడికీ చేటుకాలం వచ్చిందేమి? యిందులో యేదోకుట్రవున్నది. (వెనుకతిరిగి సుబలుఁడు నవ్వుచుండుట చూచి) ఆ పిచ్చికుఱ్ఱవాడు యేలా నవ్వుతూవున్నాడో? ఇదంతా అతనిపని అయివుంటుంది.

సుబ——మామా! మీకు వెయ్యి నమస్కారాలుచేస్తాను. ఈపని చేసినందుకు నన్ను క్షమించండి. మీదగ్గిరచేరేవాళ్ళూ మీ దగ్గిర యోగమనీ మంత్రాలనీ మాట్లాడేవాళ్ళూ యెటువంటివాళ్ళో చూపించడానికి నేను యీపనిచేసినాను.

మతి——(తనలో) వీడు మహాతెలివయినవాడుగా కనపడుతూ వున్నాడు. (బిగ్గరగా) అబ్బాయీ! యిక యీవైద్యులనిద్దరినీ మన యింటికి యెప్పుడూ రానియ్యను. నేను నీవన్నట్లు యోగపుపిచ్చ మానివేసి తెలివిగలిగి వుంటాను.

రాము—వీరిద్దరూ సఖ్యపడ్డారు. ఈయన నాతాళం పట్టిస్తాడు. దూరంగా వెళ్ళవలెను.

మతి——(రామునిజూచి) పోకు. ఆగు. నీకు యేమిశిక్షచెయ్య వలెనో నాకు తెలియకుండావున్నది.

రాము——ఈచిన్నవాడిదిగాని యిందులో నాతప్పితం యెంత మాత్రమూలేదు.

మతి——చాలును. ఈపాటి నోరుమూసుకో. నిన్ను పనిలో నుంచి తీసివెయ్యవలెను.

[అంతట గౌరి ప్రవేశించుచున్నది.]

గౌరి—అయ్యా! మీరు నామనవి చిత్తగించవలెను.

మతి—ఓరీ! నీవీగౌరిని పెళ్ళాడుతావా! నిన్ను క్షమిస్తాను.

రాము—ఏమి? గౌరీ! నన్ను పెళ్ళిచేసుకుంటావా?

గౌరి—అయ్యగారి యిష్టంవుంటే నేనువద్దంటే మానుతుందా?

మతి—(తనలో) బావా మరదలూ వాళ్ళు యెట్లా మాట్లాడు కుంటూవున్నారో!

సుబ—మామగారూ! మీ స్నేహితులను పంపించి వారిచేత నన్ను కావలసినన్ని ప్రశ్నలు వేయించినారు. మిమ్మలిని నేనువక్క ప్రశ్న వేస్తాను. దానికిజవాబు చెప్పండి. మీకోమార్తైను నాకుయి స్తారా యివ్వరా చెప్పండి.

మతి—అమ్మాయీ! యిదేమిటి? ఇతని జబ్బుసంగతి నీ వెరుగు దువుగదా?

సుమ—ఆ విషయంలో నాకేమీ భయంలేదు. నేను వుపచా రంచేస్తూవుంటే యితని కన్నీ పిచ్చలూపోతవి.

సుబ—ఆమాటనిశ్చయం. మీరావిషయంలో యేమీభయ పడవలసిన పనిలేదు. యిప్పుడు నేనుమీకు మంచివాణ్ని కాననితోస్తే యిఖముందైనా మీచేత నిజంగా మంచివాణ్ననిపించుకోవడానికి ప్రయ త్నంచేస్తాను. నానడతవల్లనే మీకన్నీ తెలుస్తవి.

మతి—అమ్మాయీ! నీచుట్టూపిచ్చకొడుకులనూ పిచ్చకూ తుళ్ళనూ పెట్టుకోవడానికి నీకు యిష్టంవున్నట్టయితే నీకోరికకు నేను యేమీఅడ్డంచెప్పను. ఇంతలేసీ యింతలేసీ పిల్లవాళ్ళను నేనునిత్యమూ యోగదృష్టితో చూస్తూ యీకంటితో యిద్దరినీ ఆకంటితో యిద్దరినీ కాంతేకనుస్తూవుంటాను. నా యోగమహిమ లోకానికి కనపరచడానికి నాకుముందు మంచి అవకాశం కలుగుతుంది. (సుమతిని సుబలుని చేతి

యొకచేతితోను నిమురుచు) బిడ్డలారా! మీరు దీర్ఘాయుష్మంతులై సుఖపడండి.

రాము—(గౌరిచేయిపట్టుకొని ముందుకువచ్చి) అయ్యా! మీరు మమ్మలిని కూడా వక్కమాటు ఆశీర్వదించండి. యిదే నాకు మీఆఖరు దీవెన. ఇదివరదాకా స్వతంత్రంగా వుండేవాణ్ని. ఇప్పుడు యీగౌరమ్మ చేతులో పడ్డాను. యిది యికనన్ను నగలు తెమ్మని చంపుతుందో బ్రతికిస్తుందో దేవుడికి తెలియవలెను. మీరు నాచావు తప్పించవలెనని వున్నట్టయితే రెండువందలరూపాయలు ఇవ్వండి. నగలు చేయంచుకుంటాము. మీ పాత తాటాకుల పుస్తకాలు వక కావిడి నాకు దయచేసి నారంటే యీ శీతాకాలము చలిమంటవేసుకుని మీరు పెళ్ళిచేయించినందుకు మీ పేరుచెప్పుకుని సుఖపడుతాము. అప్పటితో నాకునిత్యమూ పురుగులు దులపవలసిన బాధకూడా విరగడై పోతుంది.

మతి—ఓరి మోటపశువా! పవిత్రమైన పుస్తకాలవిషయమై అటువంటి మాటలంటే పాపంవస్తుంది. వూరుకో.

సుమ—రామా! బాబయ్యగారి మనసునొచ్చే మాటలనకు మావివాహం అయిన తరువాత మిమ్మలిని ఇద్దరినీ మాదగ్గిర వుంచుకుని నీపెళ్ళాము నిన్ను మింగివెయ్యకుండా కాపాడుతాములే.

సుబ—మామగారూ! మీరునన్ను నిష్కారణంగా పిచ్చవాణ్ని చేసినారు. అందుచేత నేను మిమ్మలిని మళ్ళీపిచ్చివాణ్ని చేసినాను. వంతుకువంతు సరిపోయింది. క్షమించి ఇకమీరు చెయ్యవలసినపని శీఘ్రంగా చేయించండి.

మతి—రండి లోపనికి వెళుదాము. రామా! నీవు బంధువులకందరికి [illegible] తీసికొని వెళ్ళవలెను. నేను ప్రయాణానికి సిద్ధంగావుంటాను.

(అందఱును నిష్క్రమించుచున్నారు.

[illegible]

స్త్రీల కుపయోగించు కథలు

అయిదవ సంపుటము

1 సత్యవతీ చరిత్ర
2 చంద్రమతీ చరిత్ర
3 సత్యసంజీవిని
4 చమత్కార రత్నావళి
5 సతీమణి విజయము
6 సుమిత్రచరిత్రము
7 రఘు దేవరాజీయము
8 కురంగేశ్వర వర్తకచరిత్రము
9 కళావతి పరిణయము
10 గయ్యాళిని సాధుచేయుట
11 చిత్రకేతు చరిత్రము
12 దాన కేసరీవిలాసము
13 వైదర్భీవిలాసము
14 భానుమతికళ్యాణము
15 సరసిజనమనోభిరామము
16 ధర్మకవచోపాఖ్యానము
17 కుమారద్వయవిలాసము
18 పద్మినీప్రభాకరము
19 మాలతీమధుకరము

స్త్రీలకుపయోగించు పుస్తకములు

ఆఱవ సంపుటము

1 శ్రీవిక్టోరియామహారాజ్ఞి చరిత్ర
2 సతీహితబోధిని
3 పత్నీహితసూచని
4 స్త్రీ నీతిదీపిక
5 పత్న్యుద్రాపదీ సంవాదము (మాతృపూజ పితృపూజ)
6 నీతికథామంజరి ప్ర॥ భాగము
7 డిటో ద్వి॥ భాగము
8 దేహారోగ్యధర్మబోధిని

ఉ ప న్యా స ము లు.

ఏడవ సంపుటము

1 జన్మాంతరము
2 అతిబాల్యవివాహము
3 విగ్రహారాధనము
4 ఈశ్వరదత్తపుస్తకములు
5 ఈశ్వరోపాసనము
6 ప్రార్థన
7 మానుషధర్మము
8 విద్యార్థికుల ధర్మములు
9 మనుష్యజీవితములయొక్క పరమార్థము
10 వైరాగ్యము
11 విద్యాధురీణులయర్హకృత్యము[లు]
12 వర్ణము
13 హిందూమతములు
14 స్వయంకృషి
15 సకాయకష్టకర్మలు
16 వేశ్యాకాంతల యుప॥
17 ఐకమత్యము
18 దానములు
19 స్త్రీ పునర్వివాహచరిత్రం
20 స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసం
21 స్త్రీ పునర్వివాహ విషయకప్రథమవిజ్ఞాపనము

22 స్త్రీపునర్వివాహ వి॥ ద్వి॥
23 స్త్రీపునర్వివాహశాస్త్ర సం॥
24 స్త్రీపునర్వివాహభూతవర్త మానస్థితులు

ఉపన్యాసములు జీవితచరిత్రలు

ఎనిమిదవ సంపుటము

1 దేశీయమహాసభ దానియుద్దేశము
2 శంకరాచార్యులు
3 బసవరాజు గవర్రాజుగారి జీవితచరిత్రము
4 జీసస్ చరిత్రము
5 స్వదేశసంస్థాన చరిత్రాదులు
6 విగ్రహతంత్రవిమర్శనము
7 ఉపన్యాసమంజరి
8 వివేకవర్ధని మొదటి భాగము
9 ,, రెండవభాగము
10 ,, మూడవభాగము

సాహిత్యగ్రంథములు

తొమ్మిదవ సంపుటము

1 సంగ్రహవ్యాకరణము
2 కావ్యసంగ్రహము
3 అలంకారసంగ్రహము
4 నీతిచంద్రిక విగ్రహము
5 నీతిచంద్రికసంధి
6 తర్కసంగ్రహము
6 సత్యవాదిని
8 ఉత్తమస్త్రీ చరిత్రములు

ఆంధ్రకవులచరిత్ర

పదియవ సంపుటము

పూర్వకాలపు కవుల 1 వ భా
మధ్యకాలపు కవుల 2 వ భా
ఆధునిక కవులు 3 వ భా

స్వీయచరిత్రలు

పదకొండవ సంపుటము

1, 2 భాగములు కలపి

N. B. పై గ్రంథములన్నియు వాల్యూములుగాను, విడిగాను, కూడ దొరకును.

పుస్తకములు వలయువారు :—

కార్యదర్శి, హితకారిణీ సమాజము.

రాజమహేంద్రవరము

అని వ్రాసిన బడయగలరు.